


*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**18-10-15 ఆదివారం**

ఉదయం 6.15కి మెలుకువ వచ్చింది. 7.15కి రెండు సూట్ కేస్‌లని రిసెప్షన్‌లో డిపాజిట్ చేసి, అలా లూనా రెస్టొరెంట్‌కి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళాం. పీటా బ్రెడ్, డుమాస్ బ్రెడ్ పన్నెండు రకాల బ్రెడ్స్ ఉన్నాయి. కానీ ఎగ్ కలుస్తుందనే అనుమానంతో వాటిని తాకలేదు. స్ట్రాబెర్రీ జామ్, బటర్, ఛీజ్ స్టిక్స్, ఏపిల్స్, టొమేటో, పియర్‌లని తిన్నాం. కాఫీ టీ ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రిసెప్షలోకి వెళితే డ్రైవర్ మాకోసం వేచి ఉన్నాడు.

7.30కి అంతా వేన్ ఎక్కాక డ్రైవర్ అంతా ఎక్కారో లేదో లెక్కపెట్టుకుని వేన్‌ని పోనించాడు. అభివృద్ధి చెందిన దేశాల్లోలా ఎక్కడా కారు హారన్స్ వినిపించలేదు. ఇళ్ళకి తెలుపు లేదా లేత పసుపు రంగులు మాత్రమే వేయడం గమనించాను. ఉదయం 8.45కి రోడ్‌కి కుడివైపు ఓ బిల్డింగ్ కాంప్లెక్స్ ముందు నిలబడ్డ జీనత్ పక్కన డ్రైవర్ వేన్‌ని ఆపాడు. ఎక్కాక ఆమె అందరికీ మైక్‌లో చెప్పింది.

"సబా అల్‌ఫేర్. జోర్డాన్ అరబిక్ భాషలో గుడ్మార్నింగ్ అని అర్థం. వెల్ కం టు మై టౌన్ మాదబా. దీని గురించి వివరిస్తాను. మాదబా క్రిస్టియన్స్‌కి చారిత్రాత్మక గ్రామం. 40 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న దీని జనాబా 60వేలు. ఇది బైజాంటైన్, ఉమైద్ మెజాయిక్స్‌కి ప్రసిద్ధి. బైజాంటైన్ కాలం నాటి హోలీ లేండ్ మొజాయిక్ మేప్ ఇక్కడ ఓ కేథలిక్ చర్చ్‌లో ఉంది. దాని పేరు 'ఆర్థడాక్స్ చర్చ్ ఆఫ్ సెయింట్ జార్జెస్.' ఆ ప్రాచీన మొజాయిక్ క్రిస్టియన్ మేప్ ఇక్కడి ప్రధాన ఆకర్షణ. ఇది క్రీ.శ 578కి చెందింది. ఆ రోజుల్లో జెరూసలేం భూమికి కేంద్రం అని నమ్మేవారు. (మేము గ్రీస్‌లోని డెల్ఫీకి వెళ్ళినప్పుడు దాన్ని కూడా ప్రాచీనులు భూమికి కేంద్రమని నమ్మేవారని చెప్పారు) కాబట్టి మేప్‌లో జెరూసలేం కేంద్రంగా ఉంటుంది. మాదబా గురించి బైబిల్‌లో 22-33; 13-9లలో చెప్పారు. దీన్ని రోమన్లు, బైజాంటైన్స్ పాలించారు. క్రీ.శ 451లో ఈ చర్చ్‌లో క్రిస్టియన్ బిషప్ ఉండేవాడు. ఆ పురాతన, చారిత్రాత్మక చర్చ్‌ని చూసి మనం డెడ్ సీకి వెళ్తూ, దారిలో 'మోజెస్ స్ప్రింగ్స్'ని కూడా చూస్తాం. 1955లో ఇక్కడ ఓ అపశృతి జరిగింది. క్రిస్టియన్స్‌కి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో ముస్లిమ్స్ చాలా మంది క్రిస్టియన్స్‌ని చంపేసారు. ఐతే ఇప్పుడు అలాంటి సంఘటనలు జరిగే అవకాశం లేదు. మాదబా, బెత్లెహేమ్, టెక్సాస్‌లోని డెంటన్ అనే ఊళ్ళు కవల లేదా సిస్టర్ సిటీస్. వీటి మధ్య స్నేహాన్ని, సంస్కృతిని అభివృద్ధి చేసుకోడానికి 1947లో ఇజ్రాయిల్ - జోర్డాన్ - అమెరికా దేశాల ఒప్పందం జరిగింది."

మా వాన్ మాదబాలోని ఆర్థడాక్స్ చర్చ్ ఆఫ్ సెయింట్ జార్జెస్‌కి కొద్ది దూరంలో ఆగింది. బాగా ఎండగా ఉండటంతో ఎస్.ఓ.టి.సి వారు ఇచ్చిన టోపీలని పెట్టుకుని దిగి సన్నటి సందుల్లో జీనత్‌ని అనుసరించాం. ఆదివారం ఉదయం అవడంతో చర్చ్‌లో మాస్ జరుగుతోంది. కాబట్టి అది పూర్తయ్యేదాకా, సుమారు ముప్పావు గంట దాకా పర్యాటకులని లోపలికి అనుమతించరని తెలిసింది. చర్చిలోకి పర్యాటకులు వచ్చి చూడకుండా, నేలమీద ఉన్న ఆ మొజాయిక్ మేప్ మీద ఎర్రటి తివాచీని కూడా పరిచారు. ఓ ముప్పావుగంట వేచి

ఉండడమా? లేక వెళ్ళిపోవడమా? బయట ఉన్న బోర్డు మీద గీసిన మేప్ నమూనాని చూపించి జీనత్, 'ఇది దాని నమూనా. ఇది చూస్తే చాలా?' అని అడిగింది.

"టూరిస్ట్ గైడ్‌వై ఉండి, ఆదివారం ఈ సమయంలో టూరిస్ట్‌లని రానివ్వరని తెలీదా? తిరిగి వచ్చేప్పుడు ఆగచ్చుగా?" అని మా గ్రూప్‌లోని డాక్టర్ సింహాద్రి భార్య చంద్ర జీనత్‌ని కోప్పడింది.

మౌంట్ నెబు మీద మోజెస్ మెమోరియల్





చందన్ అగర్వాల్ అనే మరొకామె మేప్‌ని చూసే వెళ్ళాలని పట్టుబట్టింది. మళ్ళీ వద్దామని జీనత్ మమ్మల్ని తర్వాత్ స్టాప్ అయిన మౌంట్ నెబూకి తీసుకెళ్ళింది. 9.25కి మాదబానించి అక్కడికి బయలుదేరాం. దారిలో ఓ చోట మా వేన్ ఆగింది. కుడివైపు ఎడారి. ఎడారిలో చిన్న లోయ. దాని పేరు వాడి మూసా. అంటే అరబిక్‌లో మోజెస్ లోయ అని అర్థం. మోజెస్ ఆ దారిలో  వెళ్తూండగా అతన్ని అనుసరించే వారు నిజంగా మోజెస్‌కి దేవుడు కనపడ్డాడని ఋజువు చేయమని కోరారు. వారి సందేహాన్ని తీర్చడం కోసం, దాహంగొన్న వారికోసం మోజెస్ వెంటనే దేవుడ్ని ప్రార్థించి ఓ రాతికింద నించి నీటి బుగ్గని సృష్టించాడు అని బైబుల్ కథనం. దాని పేరు ఐన్ మూసా (మోజెస్ నీరు, మోజెస్ బావి లేక మోజెస్ బుగ్గ) మోజెస్‌ని మూసా అని కూడా పిలుస్తారు. ఆ నీటి బుగ్గ ఆ లోయలోనే సృష్టించబడిందని జీనత్ చెప్పింది. అక్కడ నించి నబాటీన్స్ (అరేబియా, సిరియాకి మధ్య ప్రాంతాన్ని పాలించిన వారు) పెట్రా నగరానికి కాలవలద్వారా ఈ నీటిని తీసుకెళ్ళారు. అందుకని వాడి మూసాకి 'గార్డియన్ ఆఫ్ పెట్రా' అని ముద్దుపేరు.

ఈజిప్ట్‌లోని సెయింట్ కేథరిన్ అనే ఊరికి దూరంలో 'ఒయిన్ మూసా' అనే మరో మోజెస్ స్ప్రింగ్స్, బిడోయిన్ గ్రామంలో పోలీస్ స్టేషన్ చెక్ పాయింట్‌కి ఇవతల కిలో మీటర్ దూరంలో ఉందని జీనత్ చెప్పింది. అహ్మద్ హంపీ టన్నెల్‌కి దక్షిణాన 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఇజ్రాయెలైట్ ఎక్సొడస్ సమయంలో మోజెస్ ఉప్పు నీళ్ళు బుగ్గలోకి ఓ చెట్టు కొమ్మని విసిరితే తాగేందుకు వీలుగా అవి మంచి నీళ్ళుగా మారాయని మరో కథనం.

మోజెస్ సోదరుడు ఆరన్ సమాధి ఇక్కడే డెడ్ సీకి తూర్పువైపు మౌంట్ హార్ మీద ఉందని బైబిల్ కథనం. దీనికి గెబెల్ నెబి అరన్ (ప్రవక్త అరన్ కొండ) అని అరబిక్‌లో పేరు. రోడ్ మీంచి దూరంగా ఎటు చూసినా ఎడారి.

10-25కి మళ్ళీ వాడి మూసా నించి బయలుదేరి మౌంట్ నెబూకి పావుగంటలో చేరుకున్నాం. మా వేన్ కొండ దారిలో కొంతదూరం వెళ్ళాక పైన ఆగింది. దిగి మౌంట్ నెబూ పైకి కాలి నడకన చేరుకున్నాం. సముద్రమట్టానికి 2,600 అడుగుల ఎత్తుగల దీని పేరు కూడా బైబిల్‌లో వస్తుంది. మోజెస్‌కి ప్రామిస్డ్ లేండ్ (అబ్రహామ్‌కి, అతని వారసులకి దేవుడి ఇచ్చిన భూమి) దర్శనం కలిగింది ఈ ప్రదేశంలోనే అని నమ్మకం. వాతావరణం బావున్నప్పుడు ఇక్కడ నించి జెరూసలేం, వెస్ట్ బేంక్ నగరం జెరికో కనిపిస్తాయి. ఐతే పొగమంచు, గాలిలో ధూళి కణాలు వల్ల మాకు కనిపించలేదు. ఇది డెడ్ సీ పశ్చిమతీరం. మోజెస్ ఈ మౌంట్ నెబూని ఎక్కి పరమాత్మ వెళ్ళద్దని ఆజ్ఞాపించినా లేండ్ ఆఫ్ ఇజ్రాయెల్‌ని చూసాడు (నేటి ఇజ్రాయెల్ కాదు). మోజెస్ సమాధి ఈ మౌంట్ నెబూ మీదే ఉందని బైబిల్‌లో పేర్కొన్నారు. ఐతే అది అజ్ఞాతంగానే ఉంది. జెరూసలేమ్‌కి 20 కిలోమీటర్ల దూరంలో మోజెస్ సమాధి కనుగొనబడిందని కొందరు చెప్తారు. పురావస్తు తవ్వకాల్లో ఇక్కడ కొన్ని ప్రాచీన సమాధులని కనుగొన్నారు. వాటిలో ఒకటి మోజెస్‌ది అని నమ్ముతారు. డ్యూటరోనమీ అనే

క్రిష్టియన్ గ్రంథంలో పేర్కొనబడ్డ మోజెస్ సమాధి గల మౌంట్ నెబూ ఇది కాదని కొందరి అభిప్రాయం. కొందరు ఇదే అని విశ్వసిస్తారు. 2009లో పోప్ బెనెడిక్ట్ 16 ఈ ప్రదేశాన్ని సందర్శించి ఈ శిఖరం మీంచి జెరూసలేమ్‌ని చూసాడు.



మౌంట్ నెబూ మీద ఆలివ్స్ దంచే రాయి

కొండమీద మొదట మోజెస్ జ్ఞాపకార్థం నిర్మించిన దాదాపు పన్నెండు అడుగుల మోజెస్ విగ్రహం కనిపించింది. 1933లో అక్కడ ఉండే బైజాంటిన్ కాలం నాటి ఛాపెల్ (చర్చ్) నాశనమయ్యాక అదే ప్రదేశంలో ఈ విగ్రహాన్ని నిర్మించారని అక్కడి శాసనం చెప్తోంది. 20, మార్చి 2000లో పోప్ జాన్ పాల్ 2 హోలీ లాండ్ తీర్థయాత్రకి వెళ్తూ ఈ విగ్రహాన్ని సందర్శించాడు. ఆయన శాంతికి చిహ్నంగా నాటిన ఓ ఆలివ్ మొక్కని చూసాం. అక్కడే పక్కన దాదాపు పన్నెండు అడుగుల వ్యాసంలో పెద్ద రాయి నిలబెట్టి ఉంది. అది ఓ కోట తలుపు అని రాసిన బోర్డ్ ఉంది. కాని ఆలివ్స్‌ని దాని మీద పెట్టి నూనెని తీసేవాళ్ళని జీనత్ చెప్పింది. బహుశా ఇది ఆ రెండు విధాల ఉపయోగపడి ఉండచ్చు.

జీనత్ వెంట కొద్ది దూరం వెళ్తే రెండు రెక్కలు గల బెత్తానికి పాము చుట్టుకున్న పెద్ద విగ్రహం కనిపించింది. దేవుడికి, మోజెస్‌కి వ్యతిరేకంగా మాట్లాడిన ఇజ్రాయెల్ వాసులని శిక్షించడానికి దేవుడు పంపిన భయంకర సర్పాల కాట్లతో మరణించే వారిని చూసి మోజెస్ వారిని రక్షించాడు.

క్రిష్టియన్ స్టాండర్డ్ బైబిల్ 21:8,9

మోసెస్‌కి లార్డ్ చెప్పాడు. ఓ సర్పాన్ని చేసి, దాన్ని ఓ బెత్తం మీద ఉంచు. పాము కాట్లకి గురైన వారు దీన్ని చూస్తే జీవిస్తారు. మౌసెస్ ఇత్తడి సర్పాన్ని చేసి, ఓ స్థంబం మీద ఉంచాడు. పాము కాటు తిన్నవారిలో దాన్ని చూసిన వారంతా జీవించారు.

దానికి గుర్తుగా ఇటాలియన్ ఆర్టిస్ట్ జియోవన్ని ఫేంటోనీ ఈ శిల్పం రూపొందించాడు. దీన్నే నేడు వైద్యంలో చిహ్నంగా వాడుతున్నారు. యు.ఎస్ ఆర్మీ మెడికల్ కోర్ సింబల్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సింబల్స్ దీంట్లోంచే రూపొందించారు. ఈ కడ్యూసియస్ హెర్మెస్ సంప్రదాయ గుర్తు. మరో చోట మౌంట్ నెబూ సియాఘా మెమోరియల్ ఆఫ్ మోజెస్ అని రాసిన, దాదాపు 9 అడుగుల ఎత్తుగల నిలువు రాయి నేలలో పాతి కనిపించింది. దాని ముందు సందర్శకులు ఫోటోలు తీసుకుంటున్నారు.



మొజాయిక్ షాప్‌లోని ఒక చిత్రం

ఇంకొంచెం పైకి వెళ్తే ఫెన్సింగ్‌కి ఇవతల ఓ మేప్ ఉంది. అక్కడి నించి బైబిల్‌లోని క్రిష్టియన్ ప్రధాన ప్రాంతాలు ఎటువైపు, ఎంతెంత దూరంలో ఉన్నాయో దానిమీద రాసి ఉంది. కేప్ టైబెరియాస్ 106కిలో మీటర్లు. నబులస్ 68, జెరికో 27, రమల్లా 52, జెరూసలేం 46, బెత్లెహేమ్ 50, హెరోడియం 47, హెబ్రాన్ 65 కిలో మీటర్లు. ఇవన్నీ బైబిల్‌లో వచ్చే క్రిష్టియన్ పుణ్యక్షేత్రాలు. వీటిలో కొన్ని ఇజ్రాయిల్‌లో, కొన్ని పాలస్తీనాలో ఉన్నాయి. మనకి కాశీ ఎలాగో క్రిష్టియన్స్‌కి మౌంట్ నెబూ అలా పవిత్ర దర్శనీయ క్షేత్రం.

11-20కి మౌంట్ నెబూ నించి వెనక్కి మాదబాకి బయలుదేరాం. ముందుగా


చారిత్రాత్మకమైన మేప్‌లోని కొంత భాగం

మమ్మల్ని జీనత్ మొజాయిక్ ఫేక్టరీకి తీసుకెళ్ళింది. మొజాయిక్ బొమ్మలని ఎలా రూపొందిస్తారో అక్కడ డిమాన్స్ట్రేషన్ ఇచ్చారు. ఫ్రేమ్‌లోని ట్రాన్స్‌పరెంట్ అద్దం మీద ఫ్రేమ్‌కి వెనక నించి బొమ్మ ప్రకారం రంగురంగుల చిన్న మొజాయిక్ ముక్కలని ఖాళీ లేకుండా చేత్తో పేరుస్తారు. కావలసిన సైజ్‌కి మొజాయిక్ ముక్కని కటర్‌తో కట్ చేస్తారు. తర్వాత ట్వీజర్‌తో ఆ ముక్కని కావలసిన చోట పేరుస్తారు. పూర్తయ్యాక మొజాయిక్‌కి



చర్చ్‌లోని మొజాయిక్ మాప్ లోని నమూనా


మాదబాలోని పురాతన చర్చ్ లోపలి భాగం

జిగురు రాసి, పైన అట్టని అతికించి, ఆ అట్టకి ఫ్రేమ్‌ని బిగించి వెనక్కి తిప్పితే రంగురంగుల మొజాయిక్ ముక్కలతో అందంగా వాల్ హేంగింగ్ తయారవుతుంది. ఇందుకోసం, బొమ్మలో ఏ భాగంలో ఏ రంగులు ఉండాలో అతికించే వారికి ముందే తెలిసి ఉండాలి. ఆ ప్రకారం సక్రమంగా వాటిని అతికించడం నైపుణ్యంతో కూడిన విద్య. పని వాళ్ళు పని చేస్తుంటే ఈ తయారీని ఆ షాప్ గైడ్ వివరించాడు.

అక్కడ నించి షాప్‌లోకి వెళ్ళాం. అక్కడ ఫోటోలు తీయకూడదనే నిబంధన ఉంది. సందర్శకులకి బ్లాక్ టీని ఉచితంగా ఇచ్చారు. అరబ్ దుస్తులు అలంకరించిన జంట విగ్రహాలతో సహా అనేక బొమ్మలు ఉన్నాయి. బొమ్మలన్నీ బావున్నా చాలా ఖరీదు. చందన అగర్వాల్ కుటుంబ సభ్యులు చాలా కొన్నారు. సూవెనీర్స్‌గా ఐదు జోర్డాన్ దినార్స్‌తో జోర్డాన్ అని ముద్రించిన పింగాణీ కప్పుని, ఒక్కో దినార్ చొప్పున రెండు బుక్ మార్క్స్ కొన్నాం. ఆలివ్ ఆయిల్ కూడా అమ్ముతున్నారు. వైద్యానికి, వంటకి వాడే ఆలివ్ ఆయిల్ ధర బంగారం ధరంత చెప్పారు.

అక్కడ నించి ఉదయం మిస్ అయిన మాదబాలోని ఆర్థడాక్స్ చర్చ్ ఆఫ్ సెయింట్ జార్జెస్‌కి చేరుకున్నాం. నడవాల్సిన అవసరం లేకుండా ఈసారి వేన్ చర్చ్‌కి సమీపంలో ఆగింది. చర్చ్‌లోకి వెళ్ళడానికి జీనత్ ఈసారి మా అందరికీ టిక్కెట్లు కొన్నది. పదినిమిషాలు మాత్రమే అనుమతి ఇచ్చింది.

చర్చ్‌లో ఫ్లాష్‌లేని కెమెరాలని మాత్రమే అనుమతిస్తామనే బోర్డు స్పానిష్, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో ఉంది. అది చిన్న చర్చ్. వందమంది మించి పట్టరు. చర్చ్‌లో నేలమీద కళాత్మకంగా చెక్కిన మొజాయిక్ మేప్‌ని చూసాం. అది ఎవరి సెల్ ఫోన్ లోంచి తీయడానికి

కవర్ కానంత పెద్దది. చర్చ్‌లోని గోడల మీద క్రీస్తు జననం నించి శిలువ వేయడం దాకా వివిధ దృశ్యాలు మొజాయిక్ ఫ్రేమ్స్‌లో ఉన్నాయి. చర్చ్ కేష్ బాక్స్‌లో ఒక డాలర్ నోట్‌ని వేసాను.

బయట రోడ్డు మీద ఆడవాళ్ళు, పిల్లలు ఆడుకుంటూ కనిపించారు. వాళ్ళంతా సిరియానించి వచ్చిన కాందిశీకులు. బహుశవారిలోని కొందరు అక్కడ ధనవంతులై, ప్రాణాలమీద ఆశతో పారిపోయి వచ్చిన వారై ఉండచ్చు. నా దగ్గరికి వచ్చిన ఇద్దరు బీదలకి చెరో దినార్‌ని ఇచ్చాను. సిరియాలో ధనవంతులు తమ ఆస్తులు వదిలేసుకుని ఇలా పరాయి దేశంలో బిచ్చగాళ్ళవడం బాధాకరం. మనదేశంలో లానే రోడ్డు పక్కన ఆకుకూరలు అమ్మే ఓ ముసలావిడ కనిపించింది.

ఉదయం 11.50కి అంతా వేన్ ఎక్కి 40కిలో మీటర్ల దూరంలోని డెడ్ సీకి బయలుదేరాం. చర్చ్‌ని చూడడానికి వెనక్కి రావడంతో మళ్ళీ ఇందాక వెళ్ళిన దారిలోనే మౌంట్ నెబూ పక్కనించి మా వేన్ ముందుకి సాగింది.

600 ఏళ్ళ క్రితం 7 ముస్లిమ్ తెగలు ఇండియాకి వచ్చాయి. వీళ్ళని పిండారులు, థగ్స్ అని పిలిచేవారు. థగ్ అంటే హిందీలో మోసం అని అర్థం. వీళ్ళు 450 ఏళ్ళపాటు నార్త్ ఇండియాలో జీవించి డబ్బుకోసం ప్రజలని కిరాతకంగా చంపేవారు. ప్రయాణీకులతో కలిసిపోయి థగ్స్ వారి నమ్మకాన్ని పొందేవారు. రాత్రుళ్ళు అకస్మాత్తుగా ప్రయాణీకుల మెడ చుట్టూ తాడునో, చేతి రుమాలునో చుట్టి చంపి వారి విలువైన వస్తువులని దోచుకుని శవాలని పాతిపెట్టేవారు. (మగవారి వృషణాలని అదిమి దారుణంగా చంపేవారని చదివాను) ఆ విధంగా థగ్ ఇంగ్లీష్ పదంగా మారి 'దోపిడీదారు' అనే అర్థాన్ని సంతరించుకుంది. 1835లో ఆనాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా లార్డ్ విలియం బెంటింక్ థగ్స్‌ని అంతమొందించాలని సూపరింటెండెంట్ ఆఫ్ ది థగ్గీ అండ్ డెకాయిటీ డిపార్ట్‌మెంట్ ఛీఫ్ కెప్టెన్ విలియం స్లీమేన్‌ని ఆజ్ఞాపించగా ఆయన కంకణం కట్టుకుని, 1400మంది థగ్స్‌ని పట్టుకుని ఉరితీయించి అందులో విజయం సాధించాడు. ఇది చిన్నప్పుడు నా సోషల్ బుక్‌లో పాఠంగా చదువుకున్నాను. బ్రిటీషర్స్ చేసిన ఈ మహోపకారాన్ని ఉత్తర్ ప్రదేశ్ ప్రజలు ఈ నాటికీ చెప్పుకుంటారు. ఆ నాటి థగ్స్‌లోని ఓ తెగ జోర్డాన్ నించే వెళ్ళారని జీనత్ బస్‌లో చెప్పింది.

మా వేన్ 12 -30కి 'హోటల్ డెడ్ సీ' ఆవరణలో ఆగింది. అక్కడ నించి వెనక బిల్డింగ్ దాకా దాదాపు ఐదు నిమిషాలు నడిచి వెళ్ళాం. దారిలో అక్కడక్కడ ఖర్జూర చెట్లు ఉన్నాయి. నేలమీద రాలిన ఖర్జూర పళ్ళని మా గ్రూప్‌లోని కొందరు ఏరుకుని తిన్నారు. హోటల్ వెనక వైపు డెడ్ సీ. అక్కడ హోటల్ ఆవరణలో రెండు స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. వాటి పక్కనే ఉన్న పెద్ద హాల్‌లో బఫే లంచ్ ఏర్పాటు చేసారు బేక్డ్ పొటేటోలు, హేష్ బ్రౌన్స్ మేము వెళ్ళేసరికే అయిపోయాయి. వందకి పైగా ఐటమ్స్ ఉన్నా అన్నిటిలో చేపలు, లేదా చికెన్‌లాంటివి కలిపారు. మేము తినదగ్గవి పచ్చిమిర్చి, రెడ్ అండ్ గ్రీన్ బెల్ పెప్పర్ ముక్కల సలాడ్, బ్రెడ్ పుడ్డింగ్ (హల్వా) ఉల్లికాడలు, గ్రీన్ ఆలివ్స్, టొమేటో, కేరట్, కీరా, పీటా బ్రెడ్, హమ్మస్, సేమ్యా, బియ్యం కలిపి వండిన అన్నం, ఉప్పులేకుండా ఉడకబెట్టిన కూరగాయలు, పెరుగు, బక్లావా (అరేబియన్ స్వీట్)

భోజనం అయ్యాక వేన్ దగ్గరికి చేరుకున్నాం. డెడ్ సీలో స్నానం చేస్తామని అగర్వాల్ జీనత్‌ని కోరితే, అది మా ఐటినరీలో లేదని చెప్పింది. ఐతే వెళ్ళేది హోటల్‌కే కాబట్టి ఓ గంట సమయాన్ని కోరితే ఆమె ఒప్పుకుంది. అంతా సూట్ కేస్‌ల్లోంచి టవల్స్, స్విమ్మింగ్ దుస్తులు తీసుకుని ఇందాక మేము భోజనం చేసిన హాల్‌కి వెనకనించి కొద్ది దూరంలోని డెడ్ సీ తీరానికి పదినిమిషాల్లో నడిచి విశాలమైన డెడ్ సీకి చేరుకున్నాం.

డెడ్ సీ

నేను చదివిన ఓ క్రిష్టియన్ ప్రవచనంలో ఇలా చెప్పారు.

పాలస్తీనాలో రెండు సముద్రాలు ఉన్నాయి. ఒకటి సీ ఆఫ్ గెలిలీ. రెండోది డెడ్ సీ. సీ ఆఫ్ గెలిలీలోకి జోర్డాన్ నది కొండల్లోంచి తాజా నీరుని తెస్తుంది. కాబట్టి అందులో చేపలు జీవిస్తాయి. దాంట్లో వాటి హారమైన నాచు పెరుగుతుంది. చుట్టుపక్కల చెట్ల వేళ్ళు

అందులోకి విస్తరించుకోవడంతో ఆ చెట్లకి నీరు కూడా లభిస్తుంది. ఆ చెట్ల మీద పక్షులు గూళ్ళు కట్టుకుని, పళ్ళు తింటూ నివసిస్తాయి. సమీపంలో మనుషులు ఇళ్ళు కట్టుకుని నివసిస్తారు. ఆ నది ఒడ్డున పిల్లలు ఆడుకుంటారు. దాంట్లో ఎప్పుడూ తాజా నీళ్ళుంటాయి.

దక్షిణ దిక్కులో డెడ్ సీ లోకి కూడా జోర్డాన్ నది పాయ ప్రవహిస్తుంది. అందులో చేపలు ఉండవు. చెట్లు, పక్షుల పాటలు, పిల్లల ఆటల సందడి, మనుషులు నవ్వులు అక్కడ వినిపించవు. జంతువులు కాని, మనుషులు కాని ఆ పాయలోని నీటిని తాగరు. జోర్డాన్ నది ఆ రెండు పాయలకి ఒకే రకం నీటిని అందిస్తున్నా, ఇరుగుపొరుగులైన ఈ సముద్రాల మధ్య గల తేడా ఏమిటి?




తేడా ఏమిటంటే, మొదటిదైన సీ ఆఫ్ గలిలీ తనలోకి ప్రవహించే జోర్డాన్ నది నీటిని తనలోనే ఉంచుకోదు. అందులోకి ఓ చుక్క నీరు వస్తే ఇంకో చుక్క బయటకి వెళ్తుంది. తీసుకోవడం, ఇవ్వడం సమానంగా సాగుతాయి. రెండో సముద్రం తనలోకి వచ్చే నీటిని తనలోనే దాచుకుంటుంది తప్ప బయటకి వదలదు. ఇచ్చే సీ ఆఫ్ గెలిలీ ఇస్తూ జీవిస్తే, ఇవ్వని ఆ రెండో సముద్రం మరణిస్తోంది. అందుకని రెండో దానికి డెడ్ సీ అని పేరు పెట్టారు.

మనుషులు రెండు రకాలు. ఒకరు డెడ్ సీ లాంటివారు. మరొకరు సీ ఆఫ్ గెలిలీలాంటి వాళ్ళు. డెడ్ సీ జీవులకి ఎలా సహాయం చేయదో, అలా కొందరు ఇతరులకి సహాయం చేయరు. ఆధ్యాత్మికంగా వీరు నాశనమౌతారు. సీ ఆఫ్ గెలిలీలో ఎలా జలచరాలు, ఇతర జీవజాలం జీవిస్తాయో అలా కొందరు ఇతరులకి సహాయం చేస్తారు ఆధ్యాత్మికంగా వీరు అభివృద్ధి చెందుతారు.

వేల ఏళ్ళనించీ డెడ్ సీ పర్యాటకులని ఆకర్షిస్తోంది. బైబిల్‌లో కింగ్ డేవిడ్ తల దాచుకున్న ప్రదేశం ఇది. ఈజిప్షియన్ మమ్మిఫికేషన్‌లో ఉపయోగించిన ఆస్ఫాల్ట్ నించి ఎరువుల్లో ఉపయోగించే పొటాష్ దాకా దీన్నించి చాలా ఉత్పత్తి అవుతాయి. డెడ్ సీలోని ఉప్పుని, మినరల్స్‌ని ఉపయోగించి కాస్మెటిక్స్, హెర్బల్ సాచెట్స్ తయారు చేసి అమ్ముతున్నారు.

చూడటానికి సముద్రంలో ఉన్నా డెడ్ సీలో అలలు లేవు. ఇది ఇజ్రాయెల్, జోర్డాన్, వెస్ట్ బేంక్ (పాలస్తీనా)లలో విస్తరించి ఉంది. 50కిలో మీటర్ల పొడవు, పదిహేను కిలోమీటర్ల వెడల్పు గల దీని విస్తీర్ణం 600 చదరపు కిలోమీటర్లు. సగటు లోతు 653 అడుగులు. ఓ చోట 997 అడుగుల లోతు కూడా ఉంది. దీనికి సాల్ట్ సీ అనికూడా పేరు. ఇది సముద్రమట్టానికి 1,407 అడుగుల కింద ఉంది. ఇది భూమి మీద అతి తక్కువ ఎలివేషన్ గల ప్రదేశం. నీటిలో 34.2శాతం ఉప్పుగల ఇది ప్రపంచంలోని ఉప్పునీటి జలాశయాల్లో ఒకటి. వరద సమయాల్లో దీని ఉప్పు శాతం 30కి లేదా ఇంకా తక్కువకి తగ్గుతుంది. నీటిలోని ఈ అధిక ఉప్పువల్ల వీటిలో జీవజాలం బతకదు. కాబట్టి దీనికి డెడ్ సీ అనే పేరు వచ్చింది. ఐతే అతి స్వల్పమైన ఫంగే బేక్టీరియా ఇందులో ఉంది. ఈ నీటి డెన్సిటీ లీటర్‌కి 1.24 కిలోలు. కాబట్టి దీంట్లో జీవులు మునగక తేలుతారు. (మిగిలిన ఉప్పు నీటి జలాశయాలు రిపబ్లిక్ ఆఫ్ డిస్‌బౌటీలోని లేక్ అస్సల్ (34.8శాతం), అంటార్కిటాకా లోని లేక్ వాందా (35శాతం), కేస్పియన్ సీ లోని లాగూన్ గరా బొగాస్కోన్ (35 శాతం) మొదలైనవి)


వైద్యశాస్త్ర సింబల్

మేం వెళ్ళింది డెడ్ సీ హోటల్ ప్రైవేట్ బీచ్. జోర్డాన్‌లో దీని ఒడ్డున 9 అంతర్జాతీయ రిసార్ట్ హోటల్స్ ఉన్నాయి. అవన్నీ ఫోర్ లేక ఫైవ్ స్టార్ హోటల్స్. దుస్తులు మార్చుకునేందుకు అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు. తర్వాత స్నానం చేయడానికి మాత్రం గొడుగులాంటి సీలింగ్ కింద పబ్లిక్ టేప్స్ ఉన్నాయి. ఈ నీటిలోని మినరల్స్ చర్మకాంతిని పెంపొందిస్తాయని నమ్మకం. అక్కడ హెచ్చరిక బోర్డులో కళ్ళు, ముక్కు, నోళ్ళల్లోకి ఆ నీటిని పోనివ్వకూడదని రాసి ఉంది.

ఆ నీటిలో తలని నీళ్ళకి ఆనించి వెల్లకిలా పడుకుంటే, మునగకుండా తేలతాం. నేను, పద్మజ డెడ్ సీ నీళ్ళల్లోకి దిగాం. కళ్ళల్లోకి కొద్దిగా నీళ్ళు వెళ్ళి మండిపోయి ఎర్రబడ్డాయి. కారణం నీటిలోని క్షారం, రసాయనిక పదార్థలు. అగర్వాల్ నీళ్ళలో పడుకున్న తన ఇద్దరు పిల్లలకి చెరో నేషనల్ జియోగ్రాఫిక్ మేగ్‌జైన్‌ని ఇచ్చి దాన్ని వారు చదువుతున్నట్లు పట్టుకుంటే, ఫోటోలు తీసాడు. ఇండియానించి వచ్చిన ఓ ఐదారేళ్ళ నార్త్ ఇండియన్ పిల్లవాడు ఆ నీటికి భయపడి ‘పానీ నకో‘ అని తెగ ఏడుస్తున్నాడు. పావుగంట తర్వాత ఒడ్డుకి వచ్చాం. ఎండకి, ఆ క్షారానికి చర్మం మంట పుట్టింది.

ఇంగ్లండ్‌లో డాక్టర్‌గా నలభై ఏళ్ళు పనిచేసి, తిరిగి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డ డాక్టర్ సింహాద్రి స్కిన్ ఎలర్జీ ఉండడంతో నీళ్ళలోకి దిగలేదు. ఆయన నీళ్ళల్లోని మమ్మల్ని ఫోటోలు తీసారు. తర్వాత ఫోటోలు పంపుతానని ఇ మెయిల్ అడ్రస్ కూడా తీసుకున్నారు. కానీ పంపనేలేదు. ఆయన ఫోన్ నంబర్ కానీ, ఇ మెయిల్ అడ్రస్ కానీ అడిగినా ఇవ్వలేదు.

కొందరు విదేశస్థులు అక్కడి బురదని ఒంటికి పూర్తిగా పట్టించి ఎండాక పంపుల కింద నిలబడి స్నానం చేస్తున్నారు. ఇది ఇండియాలో నేచర్ క్యూర్‌లో ఒంటిలోని వేడిని, చర్మవ్యాధులని తొలగించే ఓ చికిత్సా విధానం. ఐతే విదేశస్థులు మడ్ బాత్‌ని అందంకోసం చేస్తున్నారు. ఆ హోటల్లోనే బస చేసిన తెల్లవాళ్ళు చాలామంది బికినీల్లో కనిపించారు. మేము పంపు దగ్గరకి వెళ్ళి శుభ్రంగా స్నానం చేసాక బట్టలు మార్చుకుని మళ్ళీ వేన్ దగ్గరికి వెళ్ళాం. అక్కడి నల్లటి మట్టిని పేక్స్‌గా అమ్ముతున్నారు.

వేన్ వైపు నడిచి వెళ్తూంటే ఎండ మాడ్చేసింది. టెంపరేచర్ 45 డిగ్రీల సెల్సియస్ ఉంది. డెడ్ సీ నించి సాయంత్రం నాలుగుకి మా వేన్ 135 కిలోమీటర్ల దూరంలోని పెత్రాకి  బయలుదేరింది. 3గంటల ప్రయాణం. దారిలో ఒంటరి గాడిదలు, రెండు ఒంటెలు, చెట్లు, చేమలు లేని లోయలు కనిపించాయి. ముప్పావు గంట తర్వాత 4.50కి కేరవాన్ సరాయ్ అనే చోట రెస్ట్ స్టాప్‌లో వేన్ ఆగింది. అక్కడ రెస్టరెంట్, సావనీర్ షాప్స్ ఉన్నాయి. చాలామంది కాఫీలు తాగారు. అక్కడి సావెనీర్ షాపులో కత్తులు, మొజాయిక్ ముక్కలతో చేసిన చిత్రాలు ఉన్నాయి. ‘60శాతం ఆఫ్, బై ఒన్ గెట్ ఒన్ ఫ్రీ‘ బోర్డులు ఉన్నా అవన్నీ చాలా ఖరీదుగా ఉన్నాయి. గ్రీన్ మిరాండా కేన్‌ని 3డాలర్స్ ఇచ్చి కొన్నాను. తర్వాత అగర్వాల్ చెప్పాడు, ఆ కేన్ ని తను బేరం ఆడి ఒకటిన్నర డాలర్స్‌కే కొన్నానని. చందన ప్రతీ చోట చక్కగా బేరం ఆడింది. ఆమె జైన్ మార్వాడీ. ఆ తర్వాత మేము కొనదల్చుకున్నవి కూడా ఆమే బేరమాడి పెట్టేది. ఎడారిలో చెట్లు లేకపోయినా గాలి మాత్రం వీస్తూనే ఉంది. దారిలో జీనత్, డ్రైవర్ ఏదో మాట్లాడుకుంటూంటే మైక్‌లో దేశం గురించి ఏదైనా చెప్పమని మాలోని హైదరాబాద్ నించి వచ్చిన ఓ రెడ్డిగారు కోపంగా అరిచాడు.

"డ్రైవర్‌కి, నాకు మా ఏజెన్సీ మీ హోటల్‌లో రూం బుక్ చేయలేదు. రాత్రి ఎక్కడ ఉండాలా అని చర్చించుకుంటున్నాం" ఆమె చెప్పింది.

డ్రైవర్ జీతం ఎంత అని ఎవరో అడిగితే చెప్పింది.

"డ్రైవర్ నెల జీతం 180 దినార్లు. అది సరిపోదు. పర్యాటకులు టిప్స్ ఇస్తారని జీతం తక్కువ చెల్లిస్తున్నారు. నాకు గైడ్‌గా రోజుకి వంద దినార్లు ఇస్తారు. అయితే టెర్రరిజం సమస్య వల్ల 2011 నించి పర్యాటకులు తగ్గిపోవడంతో నా ఆదాయం కూడా పడిపోయింది." జీనత్ చెప్పింది.

రాత్రి 7.30కి రోడ్ ఓ లోయలోకి దిగింది. వేన్ హోటల్‌కి చేరబోయే ముందు మర్నాటి ప్రోగ్రాం చెప్పి జీనత్ అడిగింది.

"పెత్రాలో మీరు అన్ని సీజన్లు చూస్తారు. రేపు ఉదయం 5.30కి వేకప్ కాల్. 6.30కి బ్రేక్‌ఫాస్ట్. 7.30కి బయలుదేరతాం. ఎవరికీ అభ్యంతరం లేదుగా?"

లేదని చెప్పాం.

కుడివైపు దూరంగా లైట్లు వెలుగుతూ ఓ ఊరు కనిపించింది. కొద్దిసేపటికి మా వేన్ పెత్రాలోని 'హోటల్ పనోరమా'కి చేరుకుంది. మా సామానుని వేన్‌లోంచి దింపాక హోటల్ సిబ్బందే స్కాన్ చేసి వాటిని లిఫ్ట్ దగ్గర ఉంచారు. పద్మజ రిసెప్షనిస్ట్‌ని వై ఫై ఉచితమా అని అడిగితే 'గంటకి 5 డాలర్లు' అని చెప్పాడు. జీనత్ రిసెప్షన్ నించి తాళం చెవులు తీసుకుని ఎవరివి వారికి ఇచ్చింది.

"రాత్రి 8.30కి ఈ హోటల్లోనే డిన్నర్. లాబీ మూడో అంతస్థులో ఉంది. రెండో అంతస్థులో, ఒక ఫ్లోర్ కింద బ్రేక్ ఫాస్ట్ కమ్ డిన్నర్ హాల్ ఉంది" జీనత్ తాళం చెవులు ఇస్తూ చెప్పింది.

మా రూమ్ నంబర్ 1015. రూం నంబర్ ఘనంగా ఉండాలని నాలుగు నంబర్లు ఇచ్చారు తప్ప మా గది పదో అంతస్థులో లేదు. మొత్తం మూడంతస్థుల భవంతి అది.

ఓ హోటల్ ఉద్యోగి ప్రతి వాళ్ళని వారి గదికి తీసుకువెళ్తేకానీ కనుక్కోలేని విధంగా హోటల్ ఫ్లోర్ ప్లాన్ జంతర్ మంతర్‌గా, అయోమయంగా ఉంది. లిఫ్ట్‌లో రూమ్ నంబర్స్ 901నించి 913 తొమ్మిదో ఫ్లోర్‌గా, 1001 నించి 1029దాకా పదో ఫ్లోర్‌గా బోర్డ్ మీద చూపించారు. ఇంకా 1201 నించి 1212 దాకా ఫస్ట్ ఫ్లోర్‌గా, 1101 నించి 1122 దాకా జీరో ఫ్లోర్ గా చూపించారు. 0123కి ఒక లిఫ్ట్, 2 నించి 11వ ఫ్లోర్ దాకా ఇంకో లిఫ్ట్ పనిచేస్తున్నాయి. జీరో ఫ్లోర్‌లో కారిడార్‌లో కాక, ఇంకో కారిడార్‌లోకి తీసుకెళ్ళి మా గది చూపించాడు. ముందు చిన్న రూమ్. వెనక డబుల్ బెడ్ గల పెద్ద గది. హోటల్ చుట్టూ కొండలు తప్ప చూడడానికి ఇంకేమీ లేదు.

స్నానం చేసి డైనింగ్ హాల్‌కి వెళ్ళాం. అక్కడి ఓ ఉద్యోగి మాది ఏ గ్రూపో అడిగి తెలుసుకుని ఏ టేబుల్స్‌లో కూర్చోవాలో చెప్పాడు. మరి కొందరు ఇండియన్స్ కూడా ఓ గ్రూప్‌గా వచ్చారు. వారిలోని నన్స్‌ని చూడగానే కేరళ వాళ్ళని గ్రహించి ఒకావిడతో మాట్లాడాను.

"క్రైస్తవ పుణ్యక్షేత్రాలు చూడటానికి రెలిజియస్ టూర్‌కి వచ్చాం. కేరళ ప్రభుత్వం తన ఖర్చుతో పంపింది." ఆవిడ చెప్పింది.

ఓట్ల కోసం పాట్లతో రాజ్యాంగంలో నిర్దేశించిన సెక్యులరిజాన్ని ఏనాడో ఇండియన్ పాలకులు అతిక్రమించడం నేర్చుకున్నారు. కమ్యూనిస్ట్ ప్రభుత్వంకూడా ఇలా మత రాజకీయాలు చేయడం బాధాకరం. మన దేశంలో చట్టాన్ని అతిక్రమిస్తే జైలు శిక్ష. కానీ రాజ్యాంగాన్నే అతిక్రమిస్తే వారిని ఎన్నికల కమిషన్ అందలం ఎక్కిస్తుంది అని ఇటీవలి చరిత్ర నిరూపిస్తోంది.

రాత్రి భోజనంలో శాఖాహారులకి వైట్ రైస్, నూనెలో వేయించిన కూరగాయలు, కొన్ని ఏపిల్, ఆరెంజ్ జ్యూస్, చిన్న బ్రెడ్, మార్మలేడ్ ఉన్నాయి.

చుట్టుపక్కల చూడడానికి ఏమీ లేకపోవడంతో భోజనం కాగానే రూమ్‌కి వెళ్ళిపోయాం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***